



# వీడ్కోలు

ఎన్. తారకరామారావు

**"అయితే రేపు వెళ్ళిపోవటం ఖాయమన్నమాట!"**
**'అవును!' అన్నట్లుగా తల పైకీ క్రిందకూ ఊపాడు విశ్వనాథశర్మ ఆ మాట చెప్పటానికి నోరు పెగల్లేదు. గొంతు తడారి పోయింది. కళ్ళు తడుస్తున్నాయి.**
**అప్పుడే తూర్పున ఉదయిస్తున్న సూర్యుడు ఆకాశానికి వెలుగు పులుముతున్నాడు. విశ్వనాథశర్మలోని దుఃఖాన్ని బయటకు రానీయకుండా బరువైన గుండె నిలవరిస్తున్నట్లే, పైపైకి లేస్తున్న సూర్యుడికీ మబ్బులు అడ్డు పడుతున్నాయి.**
**కృష్ణ మీదగా వీస్తున్న చల్లటిగాలి వారి మనస్సులను సేద దీర్చవలసిందిబోయి మరింత మంటలు రేపుతోంది.**
**"భూషయ్యా! రేపు మనిద్దరం కలిసి ఈ కృష్ణలో స్నానం చేసేదే ఆఖరిసారి.. అది నా జీవితానికే ఆఖరుది అవ్వవచ్చు!" స్నానం చేసేందుకు నీళ్ళలో కాలుపెడుతూ అన్నాడు విశ్వనాథశర్మ.**
**భూషయ్య దుఃఖాన్ని ఆపుకోలేకపోయాడు. వలవలా ఏడ్చేశాడు. తనకు ఊహ తెలిసినప్పటినుండీ ప్రతిరోజూ ఉదయం తాము కలిసి చేస్తున్న ఈ పని ఇక జరగబోదని అర్థమయినప్పుడు.**

విశ్వనాథశర్మ చేయి పట్టుకుని భూషయ్యను నీళ్ళలోకి దించాడు.

స్నానమయ్యేటప్పటికి పావుగంట పట్టింది. విశ్వనాథశర్మ భారంగా బయటకు వస్తూ చేతిలో వున్న తుండును తడిపి, పిండి, విదిలించి భుజాన వేసుకున్నాడు. చేతిలోని పెద్ద రాగిచెంబుతో నీళ్ళు పట్టుకున్నాడు.

ఆ పవిత్ర జలాన్ని ఇంటికి వెళుతూ వెళుతూ కాసిని శివుడి మీద, మిగతావి ఇంట్లో తులసి కోటలో పోస్తే ఈ రోజుకు ఓ కార్యక్రమం అయిపోయినట్లే!

***

విశ్వనాథశర్మ – అంటే ఊళ్ళో అందరికీ గౌరవం. ఆస్తిపరుడని, వివాదరహితుడని పైగా బ్రాహ్మడని!

విశ్వనాథశర్మ జీవితం గూడా ఊరివాళ్ళకు ఆదర్శంగా, అనుసరణీయంగా వుండటం విశేషం.

విశ్వనాథశర్మ ఆజానుబాహుడు. నల్లగా, చేవదేలి, పోతపోసిన విగ్రహంలాగా వుంటాడు. విశాలమైన పాలభాగం మీద, ఎల్లవేళలా విభూతి, కుంకుమ... ముక్కు కొనదేలి, సాపుగా ఉంటుంది. పలచటి జుట్టుకు వెనుకగా పిలక, ఖద్దరు పంచె మీద ఖద్దరు లాల్చీ, ఆపైన ఉత్తరీయం. ఇదీ ఆయన రూపం.

తొలి ఝామున లేచి, ఓ పెద్ద రాగిచెంబు, రెండు తుండుగుడ్డలు తీసుకుని, ఊరికి రెండు ఫర్లాంగుల దూరంలో వున్న కృష్ణానదికి వెళతాడు ఇంటిపక్కన ఉండే భూషయ్యతో కలిసి వాన, వరద, చలి... ఋతువుల్లో మార్పులుంటాయిగాని, వాళ్ళ దినచర్యలో మార్పులుండవు.. ఎప్పుడైనా

అందులో ఎవరైనా గ్రామాంతరం వెళితే తప్ప...

విశ్వనాథశర్మకు భూషయ్య నీడ, నిద్ర లేచిందగ్గ ర్నుంచీ, ఒకరివెంట ఒకరు వుంటారు. వీళ్ళిద్దరూ. కృష్ణ ఒడ్డున కాలకృత్యాలు తీర్చుకుని, నదిలో స్నానం చేసి, రాగిచెంబులో నీళ్లు తీసుకుని వస్తూ, వస్తూ, ఊరికవతల శివాలయంలో ప్రదక్షిణాలు చేసి, శివుడి నెత్తిన కాసిని నీళ్లు దిమ్మరించి, బార పొద్దెక్కే సరికి, ఎవరిళ్ళకు వాళ్లు వెళ్ళడం ఆనవాయితీ.

విశ్వనాథశర్మ పూజా కార్యక్రమం పూర్తిచేసుకుని వంట ఇంట్లోనుంచి బయటకు వస్తాడు. భార్య బ్రతికి వున్నంతకాలం, ఓ కంచు గ్లాసులో కాఫీ తెచ్చి వెంటనే ఇచ్చేది. దాన్ని తాగి, వీధి అరుగు మీద కూర్చుని లంక పొగాకు చుట్ట ముట్టించే సమ యానికి, భూషయ్య ఇంటికెళ్ళి చద్ది తిని, వచ్చి అరుగు పక్కగా కూర్చుంటాడు.

ఇక లోకాభిరామాయణం ప్రారంభం.

వీధిలో వెళ్ళేవాళ్ళు, నీళ్ల కావిళ్ల మోసేవాళ్లు, కూరగాయలు అమ్మేవాళ్లు – స్కూలుకెళ్లే పిల్లలు – పొలాలకెళ్లే రైతులు అందరూ విశ్వనాథశర్మకు నమ స్కరిస్తే, భూషయ్యను 'ఏం మామా, ఏం బావా' అని పలకరించేవారు.

ఇలా ఏళ్లు గడిచాయి.

విశ్వనాథశర్మ భార్య నలుగురు పిల్లల్ని కని కన్ను మూసింది. ముగ్గురు కొడుకులు – చదువు కుని ప్రయోజకులై, విదేశాల్లో భార్యాపిల్లలతో స్థిర పడ్డారు. ఒకే ఒక్క కూతురు డాక్టరు. ఆమె భర్త కూడా డాక్టరే. వాళ్ళిద్దరూ హైదరాబాద్‌లో నర్సింగ్ హోం నడుపుతున్నారు.

భార్య గతించాక, విశ్వనాథశర్మ ఊరు విడిచి వెళ్ళాల్సింది. వెళ్ళలా!

కొడుకులు బలవంతం చేశారు. కూతురు రమ్మ నమని అన్నది.

విశ్వనాథశర్మ మొరాయించాడు.

పుట్టి పెరిగిన ఊరు, వీధిలోకొస్తే అందరూ పల కరిస్తారు. ఇదివరకేమోగాని, ఇప్పుడు, సిమెంటు రోడ్లు వేశారు ఊళ్ళో. కొళాయిలొచ్చాయి. వీధి దీపాలొచ్చాయి. ఎప్పుడుపడితే అప్పుడు ఊళ్ళోకి బస్సులు, ఆటోలు వస్తున్నాయి. ఏదన్నా రోగం రొష్టు వస్తే, దగ్గర్లో వున్న పట్నానికి అరగంట ప్రయాణం. ఇవిగాక ఫోన్ సౌకర్యం వుండనే వుంది. పిల్లల చదువులకు పెళ్ళిళ్ళకు, అమ్మగా ఇంకా రెండెకరాల పొలం వుంది. నాలుగు నిట్రాళ్ళ యిల్లుంది. కనుక రాను అని విశ్వనాథశర్మ వాదిం చాడు. భీష్మించాడు.

పట్నంలో ముక్కూ ముఖం తెలియని మను ష్యుల నడుమ ఆ రొదలో తను బ్రతకలేన్నాడు.

''నీకు తిండెట్లా? మంచీ చెడు చూసేదెవరు?''

''నేనింతవరకు తుమ్మెరగను. జ్వరం రాలేదు. ఒక్కరోజు కూడా కృష్ణమ్మలో స్నానం చెయ్యకుండా వుండలేదు.''

కొడుకులు వెళ్ళారు, తండ్రి మూర్ఖుడని!

కూతురు, అల్లుడు, ''ఎప్పుడు వద్దామనిపిస్తే అప్పుడు మా దగ్గరకొచ్చేయండి'' అని చెప్పి ఊరు కున్నారు.

వారం, వారం కొడుకులు యోగక్షేమాలు విచా రిస్తారు ఫోన్లో.

కూతురు ఉదయం, సాయంత్రం ఫోన్లో పలకరి స్తుంది. – 'నాన్నా అన్నం తిన్నావా? ఆరోగ్యం ఎలా వుంది' అని.

భార్య పొయ్యాక, విశ్వనాథశర్మే రెండు పూటలా వంట చేసుకునేవాడు. బద్ధకమేస్తే, ఇంత అన్నం ఉడకేసుకొని ఊరగాయలతో భోజనం కానిచ్చే వాడు. జీతగాడు నీళ్లు తెచ్చేవాడు. కసవు ఊడ్చే వాడు. పాలు పితికి ఇచ్చేవాడు.

ఇలా కొన్నాళ్లు గడిచాక, విశ్వనాథశర్మకు విసు గొచ్చింది. కూతురు దగ్గరకు వెళ్లిపోదామా అన్న ఆలోచన వచ్చింది. ఇల్లు, పొలం, గొడ్డు గోదా అన్నీ అమ్మేద్దామనుకున్నాడు.

ఐతే, ఆ ఆలోచనా, కార్యరూపం దాల్చలేదు. అందుకు భూషయ్య కారణం.

భూషయ్యకో పెంపుడు కూతురుంది. ఆయనకు పిల్లలు లేకపోవటంతో, ముప్పయి ఏళ్ళక్రితం ఓ పని పిల్లను తెచ్చి పెంచుకున్నాడు. ఆ పాప అతడి స్వంత కూతురు కాదని, ఎక్కడో దూరాన వున్న బంధువు లామె కూతురని, ఆమె చచ్చిపోవటంతో, పాపను చూసేందుకు ఆసరా లేక, వీళ్ళే పెంచుకునేందుకు తెచ్చుకున్నారని ఆ ఊళ్లో చాలాకొద్దిమందికి తెలుసు.

మాణిక్యం నెలల పాపగా ఆ ఇంట కాలు పెట్ట టంతో వాళ్ళ స్వంత కూతురులాగానే పెరిగింది. యుక్తవయస్సు రాగానే పెళ్ళి చేశాడు. కానీ ఆమె భర్త ఓ ప్రమాదంలో చనిపోవటంతో తిరిగి తండ్రి చెంతకే కట్టుబట్టలతో జేరవలసివచ్చింది. అప్పటికే ఆమెకో మొగపిల్లవాడు. అది జరిగి అయిదారేళ్ళ యింది. భూషయ్యకు అదో దిగులు. భూషయ్య వృత్తీ పెంకుటిళ్లు కప్పడం, నేయడం. ఇప్పుడు పెంకుటిళ్ళ స్థానంలో డాబాలు వస్తుండటంతో ఆ పనులూ తగ్గి ఆర్థికంగా ఇబ్బందులు పడుతూనే ఉన్నాడు. విశ్వనాథశర్మగారి ఆ కాస్త పొలాన్నే కౌలుకు తీసుకుని చేస్తున్నాడు. విశ్వనాథశర్మకు భూషయ్య స్థితిగతులు తెలుసు. ఆయనకు చేత నయిన సాయం ఆయనా చేస్తూనే వున్నాడు. పులి మీద పుట్రలా కూతురు తలచెడి పుట్టింట జేరటం, ఆమె కొడుకును పెద్దవాడిని చేయవలసిన బాధ్యత నెత్తిన పడటం భూషయ్యకు మరో పెద్ద దెబ్బయి అతడిని మరింతగా కృంగదీసింది.

''ఈ రోజుల్లో ఇద్దరు మనుష్యుల్ని పోషించటం చాలా కష్టమయిన పనే.... అయినా ఇప్పుడు దాన్ని నేను కాదంటే ఎక్కడకు వెళుతుంది... మా ఆడ దానికీ, నాకూ గూడా వయస్సు వచ్చేస్తోంది... మేం ఉన్నంతకాలం ఏదో తిప్పలు పడతాం... తరువాత... తరువాత దానికి నేను మిగిల్చి ఇవ్వగలిగిందేమీ లేదు... అది బ్రతకాలి.. కొడుకు చేతికంది వచ్చిందాకా సాకాలి.. మీరే దాని బ్రతుక్కు ఏదో దారి చూపాలి!'' అంటూ శర్మకు చెప్పుకున్నాడు భూషయ్య.

ఇద్దరూ ఆలోచించారు. ఓ నిర్ణయానికి వచ్చారు. దాని ఫలితమే...


మాణిక్యం, తొలిఝామునే విశ్వనాథశర్మ ఇంటికి వచ్చి, ఇల్లు ఊడవటం, ముగ్గులెయ్యడం, జీతగాడు తెచ్చిన పాలు కాయడం, కూరలు తర గడం, బియ్యం కడగటం, గిన్నెలు, చెంబులు, బిందెలు తోమడం, గుడ్డలు ఉతకటం – విశ్వనాథ శర్మ వంట చేసుకునే సమయానికి అన్నీ సమకూ ర్చటం... ఇలా ఆ ఇంట్లో సమస్తమైన పనులు చేసేది. ఉదయం, సాయంత్రం విశ్వనాథశర్మ తిన్న తరువాత, తనూ తిని, ఒక్కోసారి వరండాలోనే నడుం వాల్చేది.

ఇలా మాణిక్యం జీవితానికి ఆధారం దొరికింది. విశ్వనాథశర్మకు చేదోడువాదోడుగా మనిషీ దొరికింది.

విశ్వనాథశర్మ-భూషయ్య సాయంత్రం వేళ పొలా ల్లోకి వెళ్ళేవారు. పొలాల గనేల మీద కూర్చుని వానలు, వరదలు, పంటలకొచ్చే తెగుళ్ళు,ఫల సాయం, ఇలా రకరకాల విషయాలు చర్చించుకుని, రైతుల్ని, కూలీలను పలకరించి, వస్తూ, వస్తు శివాల యంలో దైవదర్శనం చేసుకుని పిచ్చాపాటీ పూజా రితో చర్చచేసి ఇళ్లకు చేరేవారు.

ఈ లోపల మాణిక్యం, విశ్వనాథశర్మ ఇంట్లో వంటకు అన్ని ఏర్పాట్లూ చేసేది.

విశ్వనాథశర్మ రేడియో వింటూనో, టీవీలొచ్చాక టీవీ చూస్తూనో కాలక్షేపం చేసేవాడు. భూషయ్య తిండి తిని వచ్చేవాడు. మాణిక్యం తిండి తిని, గిన్నెలు కడిగి, ఇల్లు సర్దుకు వచ్చాక భూషయ్యతో



కలిసి ఇంటికెళ్ళేది.

ఇలా వాళ్ళ బ్రతుకులు ఓ గాడిన పడి నడుస్తుండగా...

ఉన్నట్లుండి పొగరాజుకుంది – మాణిక్యానికీ, విశ్వనాథశర్మకు ఏదో సంబంధం వుంది – అంటూ. అందుకే విశ్వనాథశర్మ ఏకాంతంగా ఈ ఊళ్లో స్వంత పిల్లలనందరినీ వదిలేసి వుంటున్నాడు. మాణిక్యం విశ్వనాథశర్మ అవసరాలు తీరుస్తోంది. పైగా మొగుడు చచ్చిన ముండ. ముప్పొద్దులా, విశ్వనాథశర్మ ఇంట్లో పడితింటున్నది. ఇల్లు కనిపెట్టుకుని ఉంటున్నది. ఏ సంబంధమూ, శారీరక సంబంధమూ లేకపోతే – మాణిక్యం ఎందుకు, విశ్వనాథశర్మకు అంటకాగి వుంటుంది?

పొగ రాజుకుని, రాజుకుని, ఊరంతా కమ్ముకుంది.

విశ్వనాథశర్మతో ఏకాంతంగా కూర్చున్న ఒక రోజున భూషయ్య కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు.

ఆనక, మనసులో మాట బయటపెట్టాడు.

"బాబూ! నిజానిజాలు మీకూ నాకూ తెలుసు. మీరంటే నాకు గౌరవమే కానీ ఊళ్లోవాళ్లు కాకుల్లా పొడుస్తుంటే నేను నిభాయించుకోలేకపోతున్నాను. నాకూ, మా ఆడదానికి కూడా వయస్సయిపోయింది. అది ఈ మాటలు వింటూ రోజు రోజుకూ దిగజారిపోతున్నది. సంపాదన లేదు. ఈ పరిస్థితులలో నేనేం చేయాలో నాకు అర్థం గాకుండా వున్నది.. ఈ అపవాదులు నన్ను బ్రతకనిచ్చేలా లేవు!"

విశ్వనాథశర్మ నోరు మెదపలేకపోయాడు. భూషయ్యకు ఏం సమాధానం చెప్పాలో, ఎలా ఊరివాళ్ళ నోరు మూయించాలో అర్థం కాలేదు.

ఏ తప్పూ చేయని తనమీద, అమాయకురాలైన మాణిక్యం మీద ఇలాంటి నీలినీడలు కమ్మటం ఆయన్నూ అతలాకుతలం చేస్తోంది. అచేతనుడయ్యాడు.

మాణిక్యం ఇవన్నీ విన్నదో, వినలేదో, విన్నా పట్టించుకోలేదోగాని బహుగుంభనగా ఉంటోంది. భవిష్యత్తు ఏమిటన్న భయంతో చలించడం మానుకున్నా రోజూ తను చేసే పనులు, విశ్వనాథశర్మ ఇంట్లో చేస్తూనే ఉంది.

ఎవరు ఏం చెప్పినా ఆమె ఆ ఇంటికి రావటం మానలేదు.

తల్లిద్రండులతో కూడా అదే చెప్పింది. "నేను జీవితంలో పూర్తిగా ఓడిపోయి ఇక్కడ మీ పంచన జేరాను... నాకింకా చాలా వయస్సు వున్నది. నా పిల్లవాడికి నన్ను పోషించే శక్తి వచ్చేవరకూ నన్ను నేను పోషించుకోవటమే గాకుండా వాడినీ పోషించవలసిన బాధ్యత నాదే... నేను ఏ తప్పుడు పనీ చేయటం లేదు.. తిండికోసం అలాంటి వెధవపని చేయాల్సిన అవసరం వస్తే, తిండికి బదులు ఇంత విషమైనా తింటానుగాని మకిలిని మాత్రం అంటించుకోను... మనల్ని అనే ఈ వెధవలంతా ఒక్కపూట భోజనం మనకు పెడతారేమో అడగండి.. నేను గడపదాటి బయటకు రాను!" అన్నది మొండిగా.

విశ్వనాథశర్మ ఇంటికి వస్తున్న ఆమెను వద్దన లేదు. వద్దంటే లోకులు అన్నమాటలు నిజమని అంగీకరించినట్లవుతుంది. చూద్దాం, నిజం నలుగురికీ నిలకడమీదనే తేల్తుంది అన్న దిలాసా కావచ్చు.

ఓ రోజు ఉరుము, మెరుపు, మేఘం లేకుండా వానొచ్చినట్లు, ఆ విషయం తెలుసుకున్న విశ్వనాథశర్మ కూతురు డాక్టర్ రాజేశ్వరి హైదాబాద్‌నుండి కారులో హడావిడిగా ఆ ఊరు వచ్చింది నెలరోజుల క్రితం.

ఇల్లంతా పరిశీలించింది. చిన్నప్పటినుంచీ తెలిసిన పిల్లే అయినా మాణిక్యం పనిచేస్తుంటే నఖశిఖ పర్యంతం శల్యపరీక్ష చేసింది.

మాణిక్యం – నుదుట రాణీ మార్కు రూపాయంత బొట్టు, చెవులకు ముక్కుకు ఎఱ్ఱ దుద్దులు, పోగు, మెళ్లో నల్లపూసల తాడు. దానికో వెండిబిళ్ల, మోకాళ్ల దాకా కట్టిన వంగపువ్వు రంగు చీర. కాళ్ళకు వెండి కడియాలు. మనిషి పుష్టిగా, గుమ్మటంలా వుంది.

రాజేశ్వరి చూపుల్ని పట్టించుకోకుండా మాణిక్యం ఆ పనీ, ఈ పనీ చేస్తూనే వుంది. పని చెయ్యడంలో వివరం వుంది.

"నీకిక్కడ బాగుందా?"

మాణిక్యం సమాధానం చెప్పలేదు.

"నిన్నే" అని నిలదీస్తే –

"బతకటానికి ఏదో చెయ్యాలి గదమ్మా!"

"మా నాన్నను తీసుకెళితే... ఎక్కడికెళతావ్! ఏం చేస్తావ్?"

"రెక్కలున్నంత వరకు పనిచేస్తా... ఒక్కదాన్ని బతకలేనా?"

"రోగం వస్తే పని చేసే ఓపిక లేకపోతే?"

"పైన దేవుడున్నాడు.. ఊరవతల కృష్ణమ్మ తల్లి వుంది!"

రాజేశ్వరి మాణిక్యం ధైర్యానికి విస్తుపోయింది.

విశ్వనాథశర్మకు తనొచ్చిన పని చెప్పింది.

"నాన్నా! నీకు వయస్సు మీద పడింది. ఒంటరిగా ఉండలేవు. నాతో వచ్చెయ్యి" అంది.

విశ్వనాథశర్మ ఔనని, కాదని అనలేదు. అతడూ ఊళ్ళో వాళ్ళ మాటలు తెలుసుకున్న తరువాత బాగా డస్సిపోయాడు. పైగా కూతురు ఇప్పుడు ఎందుకొచ్చిందో చూచాయగా అర్థమయింది. ఇక్కడ గోలంతా ఆమెకు ఎవరో జేరవేసారనేది స్పష్టం!

"పొలం, ఇల్లు అమ్మేద్దాం. ఆ డబ్బులు బ్యాంకులో వేస్తే వచ్చే ఆదాయం నీ ఖర్చులకు సరిపోతుంది. నేనున్నాను, అల్లుడుగారున్నారు. పిల్లలతో నీకు కాలక్షేపం అవుతుంది! ఏం?"

విశ్వనాథశర్మ నసిగాడు. "పుట్టి పెరిగిన ఊరు. తాత తండ్రులు ఈ మట్టిలో కలిశారు. నా కోరికా అదే. పైగా నిత్యం కృష్ణమ్మ ఒడిలో స్నానం చెయ్యడం, నాకలవాటు. ఇవన్నీ వదులుకుని... ఎలా?"

క్షణం తండ్రిని తీవ్రంగానే చూసింది. ఆ తర్వాత, "మాణిక్యం, సంగతి చెప్పలేదేం! దాన్ని వదలడం ఇష్టం లేదా?" అన్నది సూటిగా.

ఆయన అవాక్కై అయ్యాడు కూతురు మాటలకు.

తరువాత పావుగంటకు గాని గొంతు పెగల్చుకోలేకపోయాడు "మాణిక్యం అంటే నీకు దురభిప్రాయం ఉన్నట్లుంది!"

"అందరూ అంటున్నారు. నమ్మక ఏం చేసేది... ఐనా ఇంత వయస్సు వచ్చి, ఆ మట్టిమనిషి మీద వ్యామోహం ఎందుకు?" నిలదీసింది రాజేశ్వరి. ఎలాగైనా తండ్రిని ఇక్కడనుంచి తీసుకుపోవాలి అనేదే ఆమె ధ్యేయం. ఎంతో ఉన్నతంగా ఉన్న తన కుటుంబపు పేరు నడిబజార్లో దుమ్ములో కొట్టుకుపోవటం ఆమెకు ఇష్టంలేదు.

"రాజేశ్వరీ! చదువుకున్నావు. పైగా డాక్టరు వృత్తిలో వున్నావు. మనుష్యుల మధ్య శారీరక సంబంధం తప్ప మరే అనుబంధం ఉండదని నీ నమ్మకమా?"

"ఊరంతా ఓ మాట అల్లుకున్నప్పుడు – అందునా మన కుటుంబ పరువు విషయంలో – అది నిజం కాకపోయినా నిజమేనేమో అని మన మనస్సులకు అనిపించటం మన బలహీనత అవ్వవచ్చేమోగాని – కాదని మన చేతులు దులుపుకునేంత మానసిక స్థయిర్యం నాకులేదు!"

క్షణం విశ్వనాథశర్మ మౌనం వహించాడు. ఆపై, దీర్ఘంగా నిట్టూర్చాడు.

"చూడమ్మా. నీ నమ్మకం తప్పుకాదు. కానీ, మాణిక్యంలో, ఆమె చేతి వంటలో మా అమ్మ గుర్తొస్తుంది. ఇంట్లో పని చేస్తుంటే ఆ పనితీరులో, మీ అమ్మ జ్ఞాపకాలు గుర్తుకొస్తాయి. దిక్కులేక, బ్రతికేం

## నటన నేర్చుకోనున్న అసిన్?

అసిన్ నటన నేర్చుకోవడం అన్నది కొంచెం తికమకగా ఉన్నా, వార్త మాత్రం నూటికి నూరుపాళ్లు నిజం. నటనలో ప్రత్యేకంగా ట్రైనింగ్ తీసుకోవాలని అసిన్ నిర్ణయించుకుందట! టాలీవుడ్, కోలీవుడ్ లలో తనకెదురు లేదని నిరూపించుకున్న అసిన్ బాలీవుడ్‌కి తరలి వెళ్ళింది. దక్షిణాదిని మరిచిపోనని అసిన్ పైకి చెబుతున్నా, తన దృష్టి అంతా బాలీవుడ్ వైపే కేంద్రీకరించింది. బాలీవుడ్‌లో తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకోవాలంటే నటనలో శిక్షణ తీసుకోవడం అవశ్యం అని ఆమె భావిస్తోందట! బాలీవుడ్‌లో తన తోటి నటులందరూ ఎంతో కొంత నటనలో శిక్షణ తీసుకున్న వారేనని, తాను మాత్రమే ఎలాంటి శిక్షణ లేకుండా నేరుగా సినిమాల్లోకి వచ్చానని ఆమె చెబుతోంది. ఇక్కడ నిలదొక్కుకోవాలంటే నటనలో మరిన్ని మెళకువలు తెలుసుకోవాలని ఆమె అంటోంది. త్వరలోనే తన ఆలోచనను ఆచరణలో పెట్టనుంది.



దుకు ఈ ఇంట చేరి బ్రతుకు వెళ్ళదీస్తున్న 'మాణిక్యం' నీతి తప్పలేదు. ఏనాడు తను ఇది కావాలని ఆశించలేదు. ఇది నిజం. మీలాంటి వాళ్ళకు... ఈ బంధాలు, ఆత్మీయతలు అర్థంగావు. అర్థమయ్యేలా నే చెప్పలేను!''

రాజేశ్వరికి తండ్రి మాటలు చెవికెక్కలేదు. ఏదో వంకతో ఆయనకు ఈ ఇల్లు విడిచి రావడం ఇష్టం లేదు అనే విషయమే ఆమెను పూర్తిగా లొంగదీసుకున్నది. అందుకే ఈ దాగుడు మూతలు అని నిశ్చయించుకుంది.

''నాన్నా. ఈ చర్చ అనవసరం. నాతో వస్తావా, రావా అని నేను అడగటం లేదు... నేను నిన్ను నాతో రమ్మనమని చెబుతున్నాను... మీ అల్లుడిగారి కోరిక కూడా అదే!''

విశ్వనాథశర్మ తలొంచుకున్నాడు.

''ఆసుపత్రిలో నేను ఒక్కరోజు లేకపోయినా ఆయన కంగాళీ పడిపోతారు. నేను సరిగ్గా పదిహేను రోజులకు మళ్ళా వస్తాను. ఈలోగా ఈ ఇల్లు, పొలమూ అమ్మకానికి పెట్టేయ్... పెద్ద రేటు ఊహించుకుంటూ అదే రావాలని ఎదురు చూడబోకు.. ఎంత వస్తే అంతే.. అదీ రాదంటావా ఏ ధర్మసంస్థకో దానపత్రం రాసేయ్. మనము ఈ డబ్బుమీదే ఆధారపడిలేము. అన్నయ్యలు గాని, మేం గాని నీకు లక్షలు కావాలన్నా ఇస్తాం... నువ్వు మాత్రం ఇక్కడ ఉండటానికి వీల్లేదు.'' తరువాత గంటలోనే ఆమె వచ్చిన కారులోనే వెళ్ళిపోయింది.

***

చెప్పినట్లుగానే సరిగ్గా పదిహేను రోజులకు రాజేశ్వరి తిరిగి ఆ ఊరు వచ్చింది.

పొలం, ఇల్లు అమ్మకం అయిపోయింది. రిజిస్ట్రేషన్ కూడా అయిపోయింది.

ఇవన్నీ జరుగుతుండగానే విశ్వనాథశర్మ, ఊరంతా తిరిగి, కనబడ్డ వాళ్లందరికీ తను ఊరొదిలి వెడుతున్న సంగతి చెప్పాడు.

''చదువుకున్నోళ్లు, మంచి సెబ్బర చెప్పేటోళ్లు – ఊరొదిలి పట్నాలకెడితే సామీ, ఊళ్లెలా బాగుపడతాయి... సామీ, మీ వంశపోళ్లు, అందరూ ఎల్లారు. మీరూ ఎడితే, మట్టిలో వేళ్లు ఎండిపోతాయి. బీళ్లు మిగుల్తాయి. ఎల్లండి సామీ... నేలతల్లిని వదలి ఎల్లిపోండి'' అని దుఃఖపడ్డాడు యానాది వెంకటేసు – విశ్వనాథశర్మ వయస్సు వాడే.

***

ఆఖరి రోజు.

విశ్వనాథశర్మ ఆ ఊళ్లో ఉండడానికి అదే ఆఖరి రోజు.

ఆయన ఆ ఊరి పక్కన పారే కృష్ణలో స్నానం చేసేందుకు అదే ఆఖరి రోజు.

స్నానం చేసి వస్తూ వస్తూ శివుడి శిరస్సున కృష్ణ నీటితో అభిషేకం చేయటానికి అదే ఆఖరిరోజు....

తన ఇంటి ప్రాంగణంలోని తులసిచెట్టుకు తన చేతులతో నీరు పోసేందుకు అదే ఆఖరిరోజు...

ఆయన కృష్ణ ఒడ్డుకు నడుస్తుంటే కాళ్లు తడబడుతున్నాయి... నరాలు గుంజుతున్నట్లున్నాయి... శరీరమంతా తేలిపోతున్నట్లున్నాది.

చేతిలోని పెద్ద రాగిచెంబు చాలా బరువుగా ఉన్నట్లనిపించింది.

భుజాన ఉన్న రెండు తువ్వాలులూ అప్పుడే తడిసి బరువెక్కినయ్యా అనిపిస్తోంది.

పక్కన భూషయ్య పరిస్థితీ అలాగే వున్నది.

ఇద్దరూ కృష్ణ గట్టున అడుగులు వేస్తున్నారు.

అక్కడకు కొద్ది అడుగుల దూరంలో వంతెన ఉన్నది. దాని పక్కగా వాళ్ళకు స్నానం చేయటం అలవాటు. అక్కడయితే అప్పుడే ఉదయిస్తున్న సూర్యుడు కనబడతాడు. ఆయనకు అర్ఘ్యమిచ్చేటందుకు వీలుగా వుంటుంది. సూర్యుడు పైకి వచ్చి ఆ వంతెనమీదగా ఆయన కిరణాలు ప్రసరిస్తున్నప్పుడు రాగి చెంబు నిండా నీళ్లు నింపుకొని, నీళ్ళు పిండిన తువ్వాలును భుజంమీద వేసుకొని వెనక్కు తిరిగి అడుగులు వేయటం అలవాటు.

''కాసేపు వంతెనమీద కూర్చుందాం భూషయ్యా!'' ఆ మాట అంటున్నప్పుడు విశ్వనాథశర్మ గొంతు తడబడింది.

భూషయ్యా మరుమాట లేకుండా నీరసమొచ్చిన వాడిలా ఆ వంతెనమీద కూలబడ్డాడు.

అతడి పక్కగా అతడిని ఆనుకున్నట్లుగా విశ్వనాథశర్మ కూర్చున్నాడు.

రాగిచెంబును ముందు పెట్టుకున్నాడు.

ఇద్దరి కళ్ళూ తడిసి, ఇన్నాళ్లూ వళ్ళంతా తడుపుకున్న కృష్ణనీళ్లే, వాళ్ళ శరీరాలలో నిక్షిప్తమయి, ఇక ఆగలేక ఆ కళ్ళల్లోనుంచి బయటికి ఉబికి వస్తున్నయ్యా అన్నట్లుగా ధారాపాతంగా కారసాగినయి.

''భూషయ్యా! ఇది మాణిక్యం కోసం, మాణిక్యం పిల్లవాడికోసం, వాళ్ళ భవిష్యత్తుకోసం నేను జాగ్రత్త చేసిన సొమ్మయ్యా!'' అంటూ తన ముందున్న పెద్ద రాగించెబులోనుంచి నోట్లకట్టలు బయటకు తీశాడు. ''వాళ్లు ఎప్పుడూ తిండికి ఇబ్బంది పడకూడదు.. వాళ్ళే కాదు, నాకు అత్యంత ఆత్మీయుడివైన నువ్వు కూడా!''

భూషయ్య రెండు చేతులతో ముఖాన్ని కప్పుకుని వలవలా ఏడ్వసాగాడు.

''వద్దు... ఏడ్వవద్దు... ఈ రోజు కాకపోతే రేపయినా ఆ దేవుడు పిలిచినప్పుడు మనం విడిపోవాల్సిన వాళ్ళమే.. ఈ రోజు ఈ క్షణాల్ని మనం అనుభవించక తప్పదు. పూర్తిస్మారకంలో వున్నపుడే విడిపోవటం మనకు ఎంత ఆనందాన్ని కలిగిస్తుందో ఆలోచించు. ఎక్కడున్నా మన మనస్సులు ఎప్పుడూ ఈ కృష్ణ ఒడ్డునే కలిసి తిరుగుతుంటయి!''

భూషయ్య ఆయన మాటలకే కోలుకున్నట్లుగా భుజాన వున్న తువ్వాలుతో కళ్లు తుడుచుకున్నాడు.

కాస్త పక్కకు ఒంగి నడుము దగ్గర ధోవతి లోపల బిగ్గించి పెట్టుకున్న ఓ కవరును చేతిలోకి తీసుకున్నాడు.

''ఈ రహస్యం ఈ భూమ్మీద మనిద్దరికే తెలుసు.. నువ్వు వెళ్ళిపోయింతరువాత ఇంకా దీన్ని నేనేం చేసుకోను... దాన్ని భరించేశక్తి నాకు లేదు... నువ్వే తీసుకువెళ్ళు!'' అంటూ విశ్వనాథశర్మ చేతిలో కుక్కాడు.

ఆయన నిర్లిప్తంగా ఆ కవరును అందుకున్నాడు. అందులో ఏమున్నదో ఆయనకు తెలుసు. దాన్ని తెరిచి అందులోని ఫొటోను బయటకు తీశాడు.

''ఎప్పటికయినా ఆమె అనాథ కాదు, ఆమెకూ ఓ కన్న తల్లీదండ్రీ వున్నారు అని, వాళ్ళ రూపాన్నయినా మాణిక్యానికి చూపాలనే ఉద్ధేశ్యంతోనే కదా మనం ఇన్నాళ్ళూ ఈ ఫొటోను జాగ్రత చేసింది.. ఇప్పుడనిపిస్తోంది ఈ నిజాన్ని చెప్పి ఆమెలో ఓ విస్ఫోటనాన్ని మనం ఎందుకు కలిగించాలి... మిమ్మల్నే ఆమె తల్లిదండ్రులుగా ప్రేమిస్తున్నప్పుడు ఆ ప్రేమను అలాగే కొనసాగనీయ్!'' అంటూ ఆ చేతిలోని ఫొటోనే చూస్తూ ముక్కలు ముక్కలు చేసి రాగిచెంబులో పడేశాడు.

ఆ ఫొటోలో వున్న దపంతులలో మొగమనిషి విశ్వనాథశర్మ తండ్రని, ఆడమనిషి ఎవరో తమకు ఇప్పటికీ తెలియదని ఆ ఇద్దరికీ తప్ప మరెవ్వరికీ తెలియదు.

ఇక ముందు గూడా ఆ నిజం బయటకు రాగూడదు అన్నట్లుగానే వారు స్నానం చేయటం ప్రారంభించగానే విశ్వనాథశర్మ చేతిలోని రాగిచెంబులోని చిన్న చిన్న ముక్కలు కృష్ణ నీటి ప్రవాహంలో కొట్టుకుపోసాగినయి...

*

ఎస్. తారకరామారావు
040-23833878

